Happy Work Anniversary. 1st Year

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers

సంపుటి : 2 సంచిక : 163 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 01 మే 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 163 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 01 May 2025 PAGES : 8 PRICE : 3/-

## జూన్‌లో ప్రభుత్వంపై నిరసన

**చంద్రబాబు వైఫల్యాల్ని ప్రజల్లోకి తీసుకువెళ్లండి**

**వైకాపా జిల్లాల అధ్యక్షులతో ఆ పార్టీ అధినేత జగన్**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 30)**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై జూన్ నాటికి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలపై అదే నెలలో రాష్ట్ర స్థాయిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ నేతలకు వైకాపా అధ్యక్షుడు జగన్ స్పష్టం చేశారు. 'చంద్రబాబు చేస్తున్న విధ్వంసం అంతా ఇంతా కాదు, విద్య, వైద్యం, వ్యవసాయం లాంటి అన్ని రంగాల్లోనూ విధ్వంసమే కొనసాగుతోంది. ఆయన ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమల వుతోంది. అంతులేని అవినీతి జరుగుతోంది. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని కోరారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లాల అధ్యక్షులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాన్ని వచ్చే నెల జరిగే సమావేశంలో ప్రకటిస్తామని తెలిపారు. 'ప్రతిపక్షంగా మనకు వచ్చిన అవకాశాలను వదిలి పెట్టకూడదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎవరు లీడ్ చేయగలరు అని ఆలోచించే మీకు జిల్లా బాధ్యతలు అప్పగించా. జిల్లాస్థాయిలో ప్రజలకు సంబంధించిన అంశాలను మీరు వెలుగులోకి తీసుకు వస్తేనే ప్రజలకు దగ్గరవుతాం. ప్రజావ్యతిరేక అంశాలపై గట్టిగా పోరాడాలి. మనం అధికారంలోకి రావాలి' అని అన్నారు. **మీరే పార్టీ..** 'జిల్లాల్లో పార్టీకి మీరే సర్వం. అన్ని నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించడంలో మీదే కీలక పాత్ర. గ్రామస్థాయి వరకు పార్టీ నిర్మాణం పూర్తయితే నియోజకవర్గానికి 1,500 మంది చొప్పున ప్రతి జిల్లాలోనూ సుమారు 12 వేల మంది పార్టీ కార్యక్రమాల మిగతా 2లో

## అమరావతి పునఃప్రారంభానికి ప్రధాని మోదీ శంకుస్థాపన

**మే 2న జరిగే ఈ కార్యక్రమానికి అందరూ తరలి రావాలని సీఎం పిలుపు**

**పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తామన్న చంద్రబాబునాయుడు**

**టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు, బూత్‌స్థాయి కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 30)**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. మే 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతిలో పర్యటించి రూ. 49,040 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేయనున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు, బూత్‌స్థాయి కార్యకర్తలతో ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో డీఆర్డీవో, డీపీఐఐటీ, ఎన్‌హెచ్ఏఐ, రైల్వేలకు సంబంధించిన మరో రూ.57,962 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కూడా ప్రధాని శంకుస్థాపనలు, మిగతా 2లో



## సింహాచలం దుర్ఘటన.. బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి నాదెండ్ల

**సింహాచలం క్షేత్రం ఆవరణలో గోడ కూలి ఏడుగురు మృతి**

**బాధితులను పరామర్శించిన మంత్రులు నాదెండ్ల, అనిత.. ఎమ్మెల్యేలు రమేష్ బాబు, నాగ మాధవి**

**బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని మంత్రుల హామీ**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 30)**

సింహాచలం క్షేత్రం ఆవరణలో గోడ కూలి గాయపడిన వారి కుటుంబాలను మంత్రి నాదెండ్ల మనోహర్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, లోకం నాగ మాధవి పరామర్శించారు. ఈ సందర్భంగా క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తామని, అండగా ఉంటామని మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. పవిత్రమైన సింహాచలంలో ఇలాంటి సంఘటన చాలా దురదృష్టకరమన్నారు. చనిపోయిన ఏడుగురులో ఇద్దరు జనసేన క్రియాశీలక కార్యకర్తలు ఉండడం పార్టీకి తీవ్ర లోటు అని పేర్కొన్నారు. వీరి మరణం వాళ్ల కుటుంబాలకి తీరని లోటు అన్నారు. మృతుల కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సంఘటనపై మిగతా 2లో

## భారత్ దాడి భయాలు


### కుప్పకూలిన పాక్ స్టాక్ మార్కెట్

**కేఎస్ఈ-100 సూచీ 3,545 పాయింట్లు (3.09%) నష్టం**

**భారత్ సైనిక చర్య చేపట్టవచ్చన్న పాక్ మంత్రి హెచ్చరిక కారణం**

**పెట్టుబడిదారుల్లో భయాందోళనలతో అమ్మకాల వెల్లువ**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 30)**




భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు పాకిస్థాన్ స్టాక్ మార్కెట్‌ను కుదిపేశాయి. భారత్ రానున్న 24 నుంచి 36 గంటల్లో సైనిక చర్యకు దిగవచ్చని పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి హెచ్చరించడంతో పెట్టుబడిదారుల్లో భయాందోళనలు తలెత్తాయి. ఈ భయాలతో బుధవారం ట్రేడింగ్‌లో పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ భారీ నష్టాలను చవిచూసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి కీలకమైన కేఎస్ఈ-100 సూచీ ఏకంగా 3,545.61 పాయింట్లు (3.09 శాతం) పతనమైంది. మంగళవారం 114,872.18 వద్ద ముగిసిన సూచీ, బుధవారం 111,326.58 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ప్రారంభం నుంచే మిగతా 2లో

## పీవోకేను స్వాధీనం చేసుకోవడమే పరిష్కారం.. భారత్‌కు బ్రిటిష్ ఎంపీ సూచన

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 30)**

పహల్గాం ఉగ్రదాడిని దేశ ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై తాజాగా భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ దేశాయ్ స్పందించారు. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. ఉగ్రవాదులను శిక్షించడానికి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే.. భారత్ కఠినంగా జవాబివ్వాలని కోరారు.పీఓకే ఎప్పటికీ భారత్‌దే అని మేఘనాథ్ దేశాయ్ అన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలా క్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేశారు. కశ్మీర్ వివాదంలో ఈ ఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తాను నమ్ముతున్నానని అన్నారు. కశ్మీర్‌లో ఉన్న సమస్యల్ని శాశ్వతంగా పరిష్కరిస్తానని ప్రధాని ఇప్పటికే పలుమార్లు చెప్పారని గుర్తు చేశారు.



**ఉగ్రవాద నిర్మూలనలో భారత్‌కు సహకరిస్తాం: బ్రిటన్**

పహల్గాం ఉగ్రదాడి నేరస్థులకు కఠిన శిక్ష విధించాలని తాము భారత్‌ను కోరుతున్నట్లు బ్రిటన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. ఉగ్రవాద నిర్మూలనలో న్యూఢిల్లీకి తాము ఎప్పటికీ అండగా ఉంటామని తెలిపింది. మిగతా 2లో

## కులగణనపై కేంద్రం నిర్ణయం..

**ఈ ఘనత తమదేనని ప్రకటించుకున్న ఆర్జేడీ, కాంగ్రెస్**

**తమ దశాబ్దాల పోరాటం, డిమాండ్ వల్లే ఇది సాధ్యమైందని వ్యాఖ్యలు**

**కేంద్రం తమ అజెండానే అనుసరిస్తోందన్న లాలూ, తేజస్వి యాదవ్**

**ఇది తమ దీర్ఘకాల డిమాండ్ అని పేర్కొన్న కాంగ్రెస్ పార్టీ**

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 30)**



రానున్న జనాభా గణనలో కులాల వారీగా వివరాలు సేకరిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో, ఈ ఘనత తమదేనంటూ కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీలు ప్రకటించాయి. బీహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, కేంద్రం ఈ దిశగా అడుగులు వేయడం తమ రాజకీయ విజయంగా ఆ పార్టీలు పేర్కొంటున్నాయి.కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలో ఈ ప్రకటన చేసిన అనంతరం, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ స్పందించారు. "రిజర్వేషన్లు, కుల గణన, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం వంటి అంశాలపై మేం సోషలిస్టులం 30 ఏళ్ల క్రితమే ఆలోచిస్తే.. ఇతరులు దశాబ్దాల తర్వాత అనుసరిస్తున్నారు" అని ఆయన అన్నారు. "కుల గణనను డిమాండ్ చేసినప్పుడు మమ్మల్ని 'కులతత్వవాదులు' అని విమర్శించిన వారికి ఇది గట్టి సమాధానం. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. సంఘీలను మా అజెండా ప్రకారమే నడిపిస్తాం" అని లాలూ పేర్కొన్నారు.లాలూ కుమారుడు, ఆర్జేడీ సీనియర్ నేత తేజస్వి యాదవ్ కూడా దీనిని తమ విజయంగా అభివర్ణించారు. "ఇది మాకు గొప్ప విజయం. ప్రధాని నరేంద్ర మోదీ కుల గణనను వ్యతిరేకించారు. కానీ కేంద్రం ఇప్పుడు మా అజెండా ప్రకారమే పనిచేస్తోంది" అని తేజస్వి యాదవ్ అన్నారు. బీహార్‌లో మహాకూటమి ప్రభుత్వం మిగతా 2లో

## ప్రధాని అధ్యక్షతన 'సూపర్ క్యాబినెట్' భేటీ..

**(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 30)**

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఘటనకు భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ పలు కీలక సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకొనే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ ఈ రోజు రెండోసారి సమావేశమైంది. అనంతరం రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరిగింది. ఇక, ఈరోజు సాయంత్రం క్యాబినెట్ సమావేశం కూడా నిర్వహించనున్నారు.

**సూపర్ క్యాబినెట్..**సీసీపీఏ అనేది అత్యంత శక్తివంతమైన గ్రూప్. దానిని 'సూపర్ క్యాబినెట్' అని కూడా పిలుస్తారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో నాడు సీసీపీఏ భేటీ అయింది. ఆ తర్వాత ఈ క్యాబినెట్ కమిటీ మళ్లీ సమావేశం కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై జరిగిన దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దానిపై దేశంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ దారుణ ఘటనపై ప్రతీకార చర్యలు, పరిస్థితిని సమీక్షించేందుకు ఆనాడు సీసీపీఏ సమావేశమైంది. ఆ సమావేశంలోనే పాకిస్థాన్‌కు ఉన్న 'అత్యంత అనుకూల దేశం' వాణిజ్య హోదాను రద్దు చేయాలని భారత్ నిర్ణయించింది. ఆ ఏడాదిలో కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం బాలాకోట్‌లోని ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడి చేసి, దాయాదికి గట్టి సమాధానం ఇచ్చింది. అత్యంత కీలక సందర్భాల్లో మిగతా 2లో



## వార్షిక రుణ ప్రణాళిక రూ.6.60 లక్షల కోట్లు

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 30)**

ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాలకు రూ. 6.60 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. 22శాతం అదనంగా రుణ ప్రణాళికను రూపొందించింది. సచివాలయంలో మంగళవారం జరిగిన 231వ ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 2025-26 వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. 2024-25 రుణ ప్రణాళిక అమల్లో 127 శాతం వృద్ధి సాధించిన బ్యాంకర్లను అభినందించారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సీఎం లక్ష్యానికి అనుగుణంగా వార్షిక రుణ ప్రణాళిక రూపొందించామని బ్యాంకర్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని అధిగమించి రుణాలిస్తామని చెప్పారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, స్వయం సహాయక బృందాలకు విరివిగా రుణాలు అందిస్తామని వివరించారు. విద్యారుణాలు, గృహ రుణాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఏపీ వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, సీఎస్ విజయానంద్, బ్యాంకుల ప్రతినిధులు ఎంఎస్ఎంఈ రంగానికి గత ఆర్థిక సంవత్సరంలో రూ.87 వేల కోట్లు రుణంగా ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా..రూ.95,620 కోట్లు ఇచ్చినట్లు బ్యాంకర్లు వివరించారు. వ్యవసాయ రుణాల్లో 116 శాతం వృద్ధి సాధించామని.. గతేడాది ఖరీఫ్‌లో రూ.1,69,177 కోట్లు, రబీలో రూ.1,37,291 కోట్లు రుణంగా అందించామని నివేదించారు.

గత ఆర్థిక సంవత్సరంలో 2,54,527 మంది కౌలు రైతులకు రూ.4,411 కోట్ల రుణాలు ఇచ్చారు.

**వృద్ధి ఎందుకు తగ్గుతోంది?**

వార్షిక రుణ ప్రణాళిక అమలులో వృద్ధి ఎందుకు తగ్గుతోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బ్యాంకర్లను ప్రశ్నించారు. 2021-22 సంవత్సరం లక్ష్యంలో వృద్ధి 133శాతం, 2022-23లో 163 శాతం, 2023-24లో 138 శాతం వృద్ధి ఉండగా.. 2024-25లో 127 శాతం మాత్రమే ఉండటాన్ని ప్రస్తావించారు.

## యునిసెఫ్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ఒప్పందం

**యునిసెఫ్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ఒప్పందం**

**యువతకు నైపుణ్యాభివృద్ధి, సాధికారతకు యునిసెఫ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం**

**2 లక్షల మంది విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం**

**మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంవోయూ**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 30)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ, యువకులకు నైపుణ్యాభివృద్ధి మరియు సాధికారత కల్పించేందుకు యునిసెఫ్‌తో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ప్రభుత్వం, యూనిసెఫ్ మూడు ప్రధాన యువశక్తి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించాయి. ఈ మేరకు ఉండవల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ, యునిసెఫ్ యువాహ్ ప్రతినిధులు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా యునిసెఫ్, ఏపీఎస్ఎస్ డీసీ మిగతా 2లో



## మొదటి పేజీ తరువాయి

# అమరావతి పునఃప్రారంభానికి ప్రధాని మోదీ శంకుస్థాపన

ప్రారంభోత్సవాలు చేస్తారని సీఎం వివరించారు. గత ప్రభుత్వంలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఇచ్చిన హామీ మేరకు, ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పది నెలల్లోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు.

పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తామని, విశాఖలో టీసీఎస్, వేగంగా నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయం, శ్రీసిటీలో ఎల్జీ కంపెనీ రూ.5 వేల కోట్ల పెట్టుబడి వంటివి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని సీఎం పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే ఎన్డీఏ లక్ష్యమని, స్వర్ణాంధ్ర విజన్-2047తో ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేసిందని, రైతుల త్యాగాలను వృధా చేసిందని విమర్శించారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీల సహకారంతో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ఇతర రాష్ట్రాల ప్రజలు తమ రాజధానుల గురించి గర్వంగా చెప్పుకున్నట్లే "మా అమరావతి" అని ప్రతి ఆంధ్రుడు గర్వపడేలా రాజధానిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాజధాని నిర్మాణం ద్వారా వచ్చే ఆదాయంతో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామన్నారు.

కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలని, వారిని అన్ని విధాలా గుర్తిస్తామని, నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని సీఎం భరోసా ఇచ్చారు. వచ్చే నెలలో అన్నదాత, తల్లికి వందనం పథకాలు ప్రారంభిస్తామని ప్రకటించారు.

సింహాచలం ఘటనపై ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి

సింహాచలంలో ప్రహరీ గోడ కూలి ఏడుగురు భక్తులు మరణించడం అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాను సంఘటనా స్థలానికి వెళ్తే భక్తుల దర్శనాలకు అంతరాయం కలుగుతుందని స్థానిక నేతలు సూచించడంతో అమరావతి నుంచే పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. మంత్రులు సంఘటనా స్థలానికి వెళ్లి బాధితుల కుటుంబాలను పరామర్శించి, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని చెప్పారు. తాను ఉదయం నుంచి ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకుని ఘటన అనంతర పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించినట్లు ముఖ్యమంత్రి వివరించారు.

## సింహాచలం దుర్ఘటన.. బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి నాదెండ్ల

పూర్తి విచారణ జరిపిస్తున్నామన్నారు. ప్రభుత్వం తరుపున అన్ని రకాలుగా అండగా ఉంటామని, బాధిత కుటుంబాలని ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. అలాగే బాధితులకు జనసేన పార్టీ చీఫ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అండగా ఉంటారని మంత్రి భరోసా ఇచ్చారు. ఉదయం నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్ని విధాల ఆదుకునేలాగా సమీక్షలు జరిపినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

## కులగణనపై కేంద్రం నిర్ణయం..

ఇదివరకే కులాల వారీగా గణాంకాలను సేకరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.మరోవైపు, కాంగ్రెస్ పార్టీ కూడా ఈ పరిణామంపై హర్షం వ్యక్తం చేసింది. కులాల వారీగా గణాంకాలను సేకరించాలన్నది తమ పార్టీ చిరకాల డిమాండ్ అని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం తమ పోరాట ఫలితమేనని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

## ప్రధాని అధ్యక్షతన 'సూపర్ క్యాబినెట్' భేటీ..

మాత్రమే సీసీపీఏ సమావేశం అవుతుంది. దేశంలోని ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక విషయాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుంది. రాజకీయ చిక్కులు కలిగి ఉన్న ఆర్థిక విధానాలు, అంతర్గత భద్రతా సమస్యలపై చర్చలు, నిర్ణయాలు ఉంటాయి. వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయానికి సహాయపడుతుంది. దేశ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలను ఈ భేటీలో చర్చిస్తారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్‌షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నట్లు తెలుస్తోంది.

## యునిసెఫ్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ఒప్పందం

పరస్పర సహకారంతో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (వైఎఫ్ఎస్ఐ), యూత్ హబ్, పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్ (పీ2ఈ) కార్యక్రమాలను అమలు చేయనున్నారు. ఇంటికో వ్యాపారవేత్త, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు ఇవి ఎంతగానో తోడ్పాటును అందించనున్నాయి. యువతలో నవీన ఆవిష్కరణలు, ఇంక్లూజన్, స్థిర జీవనోపాధి అవకాశాలను పెంపొందించనున్నాయి.

యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ ద్వారా పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ అభ్యసించే 2 లక్షల మంది యువతకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉద్యోగ సృష్టి, సమస్యల పరిష్కార నైపుణ్యాలను అందించేందుకు యూనిసెఫ్ గ్లోబల్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. యూత్ హబ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యం పోర్టల్‌తో అనుసంధానించిన బహుభాషా డిజిటల్ వేదిక ద్వారా యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, వాలంటీర్‌షిప్ అవకాశాలను కల్పిస్తారు. పాస్‌పోర్ట్ టు ఎర్నింగ్ (పీ2ఈ) కార్యక్రమం ద్వారా 15 నుంచి 29 సంవత్సరాల మధ్యగల యువతకు ఉచితంగా అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్, ప్రొఫెషనల్ నైపుణ్య శిక్షణను అందిస్తారు.

## భారత్ దాడి భయాలు

అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది.పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత్ రాబోయే 24 నుంచి 36 గంటల్లో పాక్‌పై సైనిక దాడులకు పాల్పడే అవకాశం ఉందని పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అతవుల్లా తరార్ చేసిన ప్రకటన మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీసిందని ఇస్మాయిల్ ఇక్బాల్ సెక్యూరిటీస్ సీఈఓ అహ్ఫాజ్ ముస్తఫా తెలిపారు. "మంత్రి ప్రకటనతో పెట్టుబడిదారులు భయపడి, ప్రస్తుతానికి ఈక్విటీల నుంచి వైదొలగి సురక్షిత మార్గాలను చూసుకుంటున్నారు" అని ఆయన పేర్కొన్నారు.

## పీవోకేను స్వాధీనం చేసుకోవడమే పరిష్కారం.. భారత్‌కు బ్రిటిష్ ఎంపీ సూచన

పహల్గాం ఘటనకు వ్యతిరేకంగా ఇటీవల లండన్‌లో భారతీయులు నిరసన చేపడుతున్న సమయంలో అక్కడి పాకిస్థాన్ హైకమిషన్ అధికారి వారిని బెదిరిస్తున్నట్లు ఉన్న వీడియో తమను ఆందోళనకు గురి చేసిందని తెలిపింది. దీనిపై విచారణ జరుపుతున్నామని వెల్లడించింది. ఇరుదేశాలతో తమకు సత్సంబంధాలు ఉన్నందున వారి మధ్య ఉద్రిక్తతలు చెలరేగాలని తాము కోరుకోవట్లేదని పేర్కొంది. కశ్మీర్ ప్రజల నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకొని.. వారు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడాన్ని భారత్-పాక్ తమ బాధ్యతగా భావించాలని సూచించింది.

## జూన్‌లో ప్రభుత్వంపై నిరసన

కోసం అందుబాటులోకి వస్తారు. పార్టీ కమిటీల ఏర్పాటు పూర్తి చేస్తే, తర్వాత మీకూ, నాకూ పని ఉంటుంది. అందరం కలిసికట్టుగా పార్టీ కార్యక్రమాలు చేపట్టాలి. ఇప్పుడు మద్దతు ధరలు లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మనం జిల్లాల్లో రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి' అని చెప్పారు.

**త్వరగా కోలుకో సోదరా..!**

**కేటీఆర్‌ను ఉద్దేశించి మాజీ సీఎం జగన్ పోస్ట్**

'బ్రదర్ కేటీఆర్, మీరు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా' అని మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జిమ్‌లో వర్కవుట్ చేస్తుండగా గాయమైనట్లు కేటీఆర్ సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. దానికి ప్రతిస్పందిస్తూ జగన్ ఈ పోస్ట్ పెట్టారు.శింగనమల నియోజకవర్గ వైకాపా సమన్వయకర్తగా సాకే శైలజానాథ్ మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ను శింగనమల అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్తగా నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటించింది. ఇటీవలే వైకాపాలో చేరిన శైలజానాథ్‌ను పార్టీ పీఏసీలోనూ సభ్యుడిగా నియమించిన సంగతి తెలిసిందే. మరోవైపు 25 లోక్‌సభ నియోజకవర్గాలకూ పార్టీ పర్యవేక్షకులను నియమించారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎంపి మాగుంట కుటుంబం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 30)

ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆయన సతీమణి మాగుంట గీత లతా రెడ్డిల 50వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కుటుంబ సమేతంగా తిరుమల తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు వారికి అందజేసి స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు.

## మజ్జిగ పాకెట్‌లు పంపిణీ చేసిన మనవతా సంస్థ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 30)

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వల్లి టీచర్, మనవతా సంస్థ పొదిలి శాఖ చైర్మెన్ మువ్వల పార్ధసారధి సహకారంతో రూ.3,000ల విలువ కలిగిన దాదాపు 420 మజ్జిగ పాకెట్లను పొదిలి నడిబొడ్డున వున్న భవాని వారి సెంటర్‌లోని మానవత చలివేంద్రం కేంద్రం వద్ద పంపిణి జరిగింది. కేవలం అరగంట వ్యవధిలోనే 420 పైగా మజ్జిగ పాకెట్లు అయిపోవడం విశేషం. ఇదే విధంగా మరో రెండు రోజులపాటు మజ్జిగ పంపిణికి దాతలు ఆసక్తిగా ముందుకు వస్తున్నట్లు కమిటీ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె యల్లమందారెడ్డి, పొదిలి మండల కార్యదర్శి అశోక్ బండి, డైరెక్టర్ లు రోటి యస్థాన్, పేర్ల శ్రీనివాసరావు, డాక్టర్ మణి, ఎద్దు నగేష్, మామిడి వెంకటేశ్వర్లు, షేక్ బాజీ కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

## ఈదర హరిబాబు డిశ్చార్జ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 30)

మాజీ ఎమ్మెల్యే, మాజీ ఒంగోలు జెడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు ఆస్టర్ రమేష్ హాస్పటల్ నుండి డిశ్చార్జ్ అయ్యారు. ఈదర హరిబాబుని 22 ఏప్రిల్ 2025 తేదీన తీవ్ర అస్వస్థకు గురై



ప్రాణాంతకమైన పరిస్థితిలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ కి అర్ధరాత్రి సుమారు 12 గంటల తర్వాత తీసుకువచ్చారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం వంశీకృష్ణ మాట్లాడుతూ హరిబాబు హాస్పటల్‌కి వచ్చిన వెంటనే కార్డియాక్ అరెస్ట్‌కి గురయ్యారని, సుమారు 30 నిమిషాలు పైగా నిష్ణాతులైన గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె. శబరి గిరీష్ ,క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ తో కూడిన వైద్య బృందం అడ్వాన్స్ సి.పి.ఆర్ చేసి వెంటిలేటర్ సపోర్టుతో ఐ.సి.యూ తరలించి రెండు రోజులపాటు ఐ.సి.యూ ట్రీట్మెంట్ ఇవ్వాల్సి వచ్చిందని తెలిపారు. హాస్పిటల్ సి.ఓ.ఓ డాక్టర్ నల్లూరి నితిన్ మాట్లాడుతూ క్లిష్టమైన ఆరోగ్య పరిస్థితిని, హాస్పటల్ యొక్క డాక్టర్లు, సిబ్బంది సమయానుకూలంగా అధునాతన వైద్య చికిత్స అందించినందున ఆయన ఆరోగ్యం పూర్తిగా కోలుకున్న కారణంగా బుధవారం డిశ్చార్జ్ చేశారు. ఇటువంటి క్లిష్టమైన పరిస్థితిలో సమర్థవంతంగా చికిత్స అందించిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్, ఒంగోలు వైద్యులను, సిబ్బందిని హాస్పిటల్ ఎం.డి డాక్టర్ పోతినేని రమేష్ బాబు అభినందించారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌ల నిరవధిక సమ్మె



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 30)

రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మె న్యాయమైందని వెంటనే సమస్యలు పరిష్కారం చేయాలని ప్రకాశం జిల్లా 538 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమ్మె చేస్తున్నారు. ఈ బుధవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద సమ్మె రెండోరోజుకు చేరింది. అందులో భాగంగా మోకాళ్ళ మీద కూర్చొని నిరసన తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ నుండి పిహెచ్డి వరకు ఉన్నత విద్య చదివినప్పటికీ వారు చేస్తున్న ఉద్యోగానికి భద్రత లేకపోవడం దారుణమన్నారు. ఒక నిర్దిష్టమైన పని లేకుండా రకరకాల పనులు చేస్తూ పనిభారం పెంచారని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఇచ్చిన ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాలు పనిచేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23% ఇంక్రిమెంట్ ఇచ్చి వేతనాల చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఓపి దగ్గర నుంచి అన్ని రకాల పనులు చేస్తూ గర్భిణీలకు, టీబీ రోగులకు, బిపి షుగర్,చిన్న పిల్లలకి, క్యాన్సర్ పరీక్షలు అన్ని రకాల వైద్య సలహాలు,సౌకర్యాలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇలాంటి వారి కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైద్య రంగంలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలని నిరంతరం పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. గత సంవత్సర కాలంగా పెండింగ్లో ఉన్న ఇన్సెంటివ్స్,అలాగే ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ అద్దె బకాయిలు , పిఎఫ్ సౌకర్యం కూడా తీసివేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈసంజీవని టెలి మెడిసిన్ సేవలు,గర్భిణీలు, టీబి రోగులు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఎవరూ కూడా బాధపడకుండా వారికి సౌకర్యాలు అందించాలని అనుకుంటే వెంటనే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలను పరిష్కారం చేసి వారి సమ్మెను విరమింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.






## కమిషనర్ నారాయణరెడ్డిని కలిసిన పలువురు టీడీపీ నాయకులు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 30)

నూతన కమిషనర్ నారాయణరెడ్డిని బుధవారం ఆయన కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు సోమిశెట్టి శ్రీదేవి, శివాలయం ప్రతిపాదిత చైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, వాసవి షాపింగ్ కాంప్లెక్స్ ట్రెజరర్ సోమిశెట్టి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్






(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 30)

ఘట్టమనేని కోటయ్య ఇటీవలే మరణించగా నేడు దశదిన కార్యక్రమం సందర్భంగా హాజరై కోటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఆర్ఎంపీ డాక్టర్ చెన్నుపల్లి శ్రీనివాసరావు ఇటీవలే గుండె సమస్యతో మరణించగా వారి ఇంటికి వెళ్లి శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కంచర్ల వాసు ఇటీవలే అనారోగ్యంతో మరణించగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 01.05.24
గురువారం

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం



## బలోపేతానికి నూతన గ్రామ కమిటీలు

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, ఏప్రిల్ 30)

పార్టీ బలోపేతానికి నూతన గ్రామ కమిటీలు సమిష్టిగా కృషి చేయాలని టిడిపి నాయకులు తెలిపారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి, చింతకుంట్ల, వాగుమడుగు, వద్దిమడుగు టిడిపి గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీలు అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చినారికట్ల (తరువాయి 4లో...)

# రాష్ట్ర వ్యాప్తంగా నేటికి 70 వేల వ్యవసాయ కనెక్షన్లు

### భవిష్యత్తులో మరో 50 వేలు అందించేందుకు ప్రణాళికలు
### అద్దంకిలో రెండు సబ్ స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి గొట్టిపాటి
### 12 ఏళ్ల తరువాత అద్దంకిలో శాశ్వత అగ్నిమాపక కేంద్రానికి శంకుస్థాపన



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 30)

రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 70 వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. భవిష్యత్తులో మరో 50 వేల వ్యవసాయ కనెక్షన్లు అందించేందుకు ఇంధన శాఖ సిద్ధంగా ఉన్నట్లు మంత్రి గొట్టిపాటి వివరించారు. అద్దంకి నియోజకవర్గంలో బుధవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా అద్దంకి నియోజకవర్గంలో మరో రెండు సబ్ స్టేషన్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు రూ.11 కోట్ల తో నిర్మించనున్న ఈ రెండు సబ్ స్టేషన్లకు భూమి పూజ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా వినియోగానికి తగినట్లు నాణ్యమైన విద్యుత్ ను అందించే దిశగా రెండు సబ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకుని రానున్నట్లు పేర్కొన్నారు. అంతేగాకుండా ఇప్పటి వరకు అద్దంకిలో 1700 కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలను మార్చినట్లు మంత్రి గొట్టిపాటి వివరించారు.

రానున్న రోజుల్లో మరో 500 కొత్త విద్యుత్ స్తంభాలను అందుబాటులోకి తీసుకు వస్తామని హామీ ఇచ్చారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ సంస్కరణలను అమలు చేయలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని అన్నారు. అనాలోచిత నిర్ణయాలతో జగన్ రెడ్డి ప్రతీ వ్యవస్థను భ్రష్టుపట్టించినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద నమ్మకంతో, ఆంధ్రుల కలల రాజధాని అమరావతిని నిర్మించేందుకు భూములు ఇచ్చిన రైతులను కూడా జగన్ ఇబ్బంది పెట్టినట్లు పేర్కొన్నారు. అమరావతి పూర్తి అయితే తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే దుర్మార్గపు ఆలోచనతో మూడు రాజధానుల పేరుతో జగన్ నాటకం ఆడినట్లు స్పష్టం చేశారు. ప్రజలకు ఉపయోగపడే మంచి కార్యక్రమాలు ఏ ప్రభుత్వం తీసుకొచ్చినా.. తరువాత వచ్చే ప్రభుత్వాలు వాటిని కొనసాగించాలని అన్నారు. నాడు సీనియర్ ఎన్టీఆర్ ప్రారంభించిన రూ.2 లకే కిలో బియ్యం ప్రభుత్వాలు మారినా ఇప్పటికీ అలానే కొనసాగుతుందని చెప్పారు. ఏపీ ప్రజల జీవనాడి పోలవరాన్ని కూడా రివర్స్ టెండరింగ్ పేరుతో నాశనం చేసిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డని ఆయన విమర్శించారు. (తరువాయి 4లో...)

# పారిశ్రామికవాడల అభివృద్ధితోనే పారిశ్రామిక ప్రగతి

### రాష్ట్రవ్యాప్తంగా 10 నియోజకవర్గాల్లో సిద్ధమైన ఎంఎస్ఎంఈ పార్కులు
### మరో 40 పార్కులకు శంకుస్థాపన
### నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
### సుమారు 200 మంది పారిశ్రామికవేత్తలతో పరిశ్రమల ఏర్పాటుపై చర్చించనున్న సీఎం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 30)

రాష్ట్రంలో నియోజకవర్గానికొక పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడం, ఇంటికో పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దడం లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. రాష్ట్రానికి భారీ పరిశ్రమలను ఆకర్షిస్తూ రూ. వేల కోట్ల పెట్టుబడులతో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టిస్తోంది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ ఎంఈ పార్కులను అభివృద్ధి చేసి, వాటిలో సూక్ష్మ,, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను నెలకొల్పుతా మని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం వేగంగా నెరవేరుస్తోంది. అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలోనే రాష్ట్రంలోని 10 నియోజక వర్గాల్లో అన్ని మౌలిక వసతులతో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసింది. ఈ పారిశ్రామిక పార్కులను మే 1న ముఖ్యమంత్రి చంద్రబాబు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని మరో 40 నియోజకవర్గాల్లో ఎంఎస్ ఎంఈ పార్కుల అభివృద్ధికి శంకుస్థావన చేయనున్నారు. ఆయా పార్కులలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్ర మలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే వారికి సరసమైన ధరలకే భూ కేటాయింపులు చేయడంతోపాటు అన్నివిధాలుగా ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుంది. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఆత్మకూరు నుంచే సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. నారంపేట వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 173 ఎకరాల ఎంఎస్ఎంఈ ప్రాజెక్టును సందర్శించి ప్రారంభిస్తారు. ఆత్మకూరు నుంచే రాష్ట్రవ్యాప్తంగా 50 పారిశ్రామికవాడలను సీఎం వర్చువల్గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. ఆత్మకూరు నారంపేట ఎపిఐఐసి పార్కు ఏర్పాటుతో భారీగా పరిశ్రమలు

# ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 30)

కొత్తపట్నం మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కొత్తపట్నం మండలంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా విస్తృతంగా పర్యటించారు. తొలుత జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా కొత్తపట్నం మండలం రంగాయపాలెంలోని శ్రీ కృష్ణం వెంకటరావు డెయిరీ ఫారంను సందర్శించి, పాడి రైతులకు సబ్సిడీతో మేత విత్తనాలను, దాణా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డెయిరీ ఫారం ఏర్పాటుకు ఎంత ఖర్చయింది, డెయిరీ నిర్వహణకు నెలకు ఎంత ఖర్చవుతుంది, ఆదాయం ఎంత వస్తుంది తదితర విషయాలను జిల్లా కలెక్టర్, డెయిరీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ డెయిరీ ఫాం ఏర్పాటుకు 25 లక్షల రూపాయలు రుణం తీసుకోవడం జరిగిందని, డెయిరీ ఫాం లో 32 ఆవులు ఉన్నాయని, వీటి వలన సుమారు రోజుకు 400 నుండి 500 లీటర్ల వరకు పాలు వస్తున్నదని డెయిరీ ఫాం నిర్వాహకులు చెప్పడం జరిగింది. నెలకు కూలీలు, నిర్వహణకు, దాణా కు, ఈఎంఐ తదితర ఖర్చులు పోను నెలకు సుమారు లక్ష రూపాయల నుండి ఒకటిన్నర లక్ష ఆదాయం వస్తుందని డెయిరీ నిర్వహకులు వివరించడం జరిగింది. గతంలో లీటరుకు 40 రూపాయలు వచ్చేదని, నేడు 37 రూపాయలు మాత్రమే తున్నదని, 40 రూపాయలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్, కొత్తపట్నం డిడికాలనీలో రైతు పి వెంకటేశ్వర్లు సంబంధించి ప్రకృతి వ్యవసాయంతో సాగుచేస్తున్న వేరుశనగ పొలాన్ని సందర్శించి రైతుతో మాట్లాడటం జరిగింది. ప్రస్తుతం వేరుశనగ పంట తో పాటు అంతర పంటలుగా పొద్దుతిరుగుడు, బెండకాయ, క్లస్టర్ బీన్ సాగుచేయడం జరుగుచున్నదని, గతంలో ఎకరాకు సుమారు 55 వేల రూపాయలు ఖర్చు అయ్యేదని, ఖర్చులు పోను ఆదాయం ఎకరాకు సుమారు 15 వేల రూపాయలు వచ్చేదని, నేడు ప్రకృతి వ్యవసాయంతో పాటు అంతర పంటల సాగు వలన ఖర్చు ఎకరాకు 40 వేల రూపాయలు మాత్రమే ఖర్చు అగుచున్నదని, ఖర్చులు పోను సుమారు 25 వేల రూపాయల దాకా ఆదాయం వస్తున్నదని ఈ సందర్భంగా రైతు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కొత్తపట్నం మండలం, గమళ్ళపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా పిఎండిఎస్ విధానంలో సాగు చేస్తున్న రైతు పి వెంకటేశ్వరరెడ్డి కి సంబంధించిన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు బంజరు భూమిలో పిహెచ్, తేమ, ఉష్ణోగ్రత నమోదుపై లైవ్ డెమో, అలాగే పిఎండిఎస్ క్షేత్రంలో మట్టి నమూనా సేకరణపై నిర్వహించిన డెమోను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పిఎండిఎస్ విధానం వలన సాయిల్ హెల్త్, క్రాప్ హెల్త్ బాగా వృద్ధి చెందుతుందని వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్, కొత్తపట్నంలోని హార్టీకల్చర్ క్షేత్రాన్ని సందర్శించి, పలు రకాల హార్టీకల్చర్ మొక్కల పెంపకం విధానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఎండిఎస్ కిట్ల తయారీ మరియు పంపిణీపై అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ తిలకించి సంబంధిత అధికారులు, రైతుల వద్ద నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, రైతులకు జీలుగా, జనుము, పిల్లిపిసర విత్తనాలను సబ్సిడీతో అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హార్టికల్చర్ (తరువాయి 4లో...)

4

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

### మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు అవగాహన కల్పించడమే ఏకైక మార్గం
### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా
### గంజాయి, మాదకద్రవ్యాలను దరి చేరనియ్యరాదు
### జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్
### గంజాయిని రవాణా చేసినా, వినియోగించినా చట్టపరంగా కఠిన చర్యలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 30)

కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ జిల్లా స్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. డ్రగ్స్ వినియోగంవల్ల కలిగే దుష్ఫలితాలను పెద్ద ఎత్తున వివరించడమే కాకుండా, జిల్లాలో పూర్తిస్థాయి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో డ్రగ్స్ను పూర్తి స్థాయిలో నివారించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు, ప్రతీఒక్కరికీ అవగాహన కల్పించడమే ఏకైక మార్గమని అందులో భాగంగా ప్రతీ విద్యాసంస్థలో అవగాహనా కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఈగిల్ క్లబ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఔషద నియంత్రాణాధికారులు సంయుక్తంగా మందుల షాపులను తనిఖీ చేయాలని ఆదేశించారు. డ్రగ్స్ వినియోగం, రవాణాపై నిఘాను పెంచి, అరికట్టేందుకు మరింత సమర్ధవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులు చేసేందుకు ఏర్పాటు చేసిన 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. విద్యార్థులతోపాటుగా వివిధ వర్గాల్లో విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా జిల్లాలో డ్రగ్స్ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టడం సాధ్యపడుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలను అరికట్టడానికి తీసుకున్న చర్యలను వివరించారు. జిల్లాలో ఎక్కడా గంజాయి పంట సాగు జరగడం లేదని తెలిపారు. జిల్లా మీదుగా రవాణా జరుగుతోందని, దీనిని అరికట్టేందుకు పటిష్టమైన (తరువాయి 4లో...)

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి









చర్యలను తీసుకున్నామని చెప్పారు. నమోదు చేసిన కేసుల సంఖ్య ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా గంజాయి, డ్రగ్స్ వినియోగం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. డ్రగ్స్ సరఫరా, వినియోగం కూడా శిక్షార్హమేనని, గంజాయి, డ్రగ్స్ వినియోగం కలిగే దుష్ప్రభావాలపై పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇతర ప్రాంతాల నుండి మైనింగ్ పనుల కొరకు ఇతర ప్రాంతాల నుండి కూలీలు జిల్లా కు వస్తుంటారని, సంబంధిత పరిశ్రమల యాజమాన్యం వారిని సమన్వయము చేసుకొని కూలీల పై నిఘా ఉండేలా మైనింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. డ్రగ్స్ వినియోగం, సరఫరాకు సంబంధించి 283 మందిని గుర్తించడం జరిగిందన్నారు. ఒంగోలు లో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని, కళాశాలల్లో ఈగిల్ టీమ్‌లు, డ్రాప్ బాక్సులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మత్తుపదార్థాల వినియోగాన్ని మాన్పించేందుకు జిల్లాలో డీ అడిక్షన్ సెంటర్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతోనే పూర్తి స్థాయిలో డ్రగ్స్‌ను అరికట్ట వచ్చునని జిల్లా ఎస్పీ గారు సూచించారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ హాస్టళ్లనందు డ్రగ్స్ వినియోగం జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. స్కూల్స్, కాలేజ్, హాస్టల్స్, మరియు దాబాలలో, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజ్ లలో బోర్డ్ లు.. మత్తు పదార్థాల నివారించే చర్యలపై పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డ్రగ్స్ నియంత్రణ పై రూపొందించిన బ్రోచర్ల ను ఆవిష్కరించారు. గంజాయి, డ్రగ్స్ , ఇతర మత్తు పదార్థాల అమ్మకం ,రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు లేదా పోలీస్ డయల్ 100, 112 తెలియజేయాలని, అట్టివారు వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలో విద్యార్థినులకు గుడ్ టచ్ , బ్యాడ్ టచ్ మధ్య తేడా తెలియచేయాలని,స్వీయ రక్షణ, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో జరిగే మోసలపట్ల మరియు చట్టాలపై, ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి కూడా అవగాహన కల్పించాలని, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించాలన్నారు. పిల్లలపై నేరాలకు సంబంధించిన సమాచారం వెంటనే పోలీస్ వారికి తెలియచేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వర రావు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, డిఆర్ఓ చిన ఓబులేసు, ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఆర్‌డిఓ లక్ష్మీ ప్రసన్న, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలు, డిడి సోషల్ వెల్ఫేర్ లక్ష్మా నాయక్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బలోపేతానికి నూతన గ్రామ కమిటీలు

సొసైటీ అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ మూరబోయిన బాబురావు యాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికే సుఖదేవ్ (బూన్), మాజీ మండల కన్వీనర్ తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాటమ రాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## పారిశ్రామికవాడల అభివృద్ధితోనే పారిశ్రామిక ప్రగతి

ఆత్మకూరు ఎంఎస్ఎంఈ పార్కు వద్ద సుమారు 200మంది పారిశ్రామిక వేత్తలతో సీఎం సమావేశమవుతారు. పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులు, ఉద్యోగ ఉపాధి అవకాశాలపై పారిశ్రామికవేత్తలతో సీఎం చర్చించనున్నారు. ప్రతి కుటుంబంలో ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే లక్ష్యంగా యువత భవిష్యత్, ఉపాధి ఉద్యోగాలకు ఈ పారిశ్రామికవాడలు బాటలు వేస్తాయని స్థానిక ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు ఆకాంక్షిస్తున్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా నేటికి 70 వేల వ్యవసాయ కనెక్షన్లు





**శాశ్వత అగ్నిమాపక కేంద్రానికి శంకుస్థాపన:** అద్దంకిలో శాశ్వత అగ్నిమాపక కేంద్రానికి రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు శాశ్వత అగ్నిమాపక భవనం లేక స్థానికంగా ఉండే వ్యవసాయ మార్కెట్ యార్డులో అగ్నిమాపక సిబ్బంది తమ కార్యక్రమాలు నిర్వహిస్తుండేవారు. దీనిని గమనించిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్... శాశ్వత భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి పూర్తి అనుమతులతో స్థానికంగా శింగరకొండ వద్ద అగ్నిమాపక భవనం కు బుధవారం నాడు శంకుస్థాపన చేశారు.

**ప్రధాని మోడీ సభ విజయవంతం చేయండి :** అద్దంకిలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మే 2 తేదీన జరగనున్న అమరావతి పునర్నిర్మాణ సమావేశానికి అద్దంకి నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పిలుపునిచ్చారు. సభకు వచ్చే ప్రజల కోసం రవాణా, భోజన ఏర్పాట్లను ప్రభుత్వం చేపడుతుందని మంత్రి తెలిపారు. వేసవి కాలం కాబట్టి సభకు వచ్చే వారికి మంచినీరు ప్యాకెట్లను అందించడంతో పాటు మజ్జిగ ప్యాకెట్లను కూడా అందించేలా స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి కోరారు.

# ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించాలి









ఫాం లో మొక్కను నాటారు. ఈ కార్యక్రమాల్లో ఒంగోలు ఆర్‌డిఓ లక్ష్మి ప్రసన్న, పశు సంవర్ధక శాఖ జెడి డాక్టర్ బేబి రాణి, వ్యవసాయ శాఖ ఇంచార్జి జెడి సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, ప్రకృతి వ్యవసాయ డిపిఎం సుభాషిణి, ఎపిఎంఐపి పిడి రమణ, జిల్లా హార్టీకల్చర్ అధికారి గోపి చంద్, తహసిల్దార్ పి మధుసూధనరావు, ఎంపిడిఓ శ్రీకృష్ణ, మండల వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

### జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

### నెల్లూరు జిల్లా పరిషత్ 2025-26కు రూ.379 కోట్లతో బడ్జెట్ ఆమోదం




**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 30)**

ప్రస్తుత వేసవికాలంలో గ్రామాల్లో మంచినీటి కొరతలేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ కోరారు. బుధవారం జెడ్పి హాల్లో 2025-26 బడ్జెట్ ఆమోదం, ఇతర అంశాలకు సంబంధించి జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కావలి ఎమ్మెల్యే కృష్ణ రెడ్డి, డి ఆర్ ఓ ఉదయభాస్కర్, జెడ్పి సి ఇ ఓ విద్యారమ పాల్గొన్నారు. వేసవి లో మంచినీటి ఎద్దడి నివారణ చర్యలు, కావలి కాలువ మరమ్మత్తు పనులు, చింతారెడ్డి పాలెం వద్ద అండర్ పాస్ నిర్మాణం, జల్ జీవన్ మిషన్ పనులు, జెడ్పి గ్రాంట్ నిధులతో చేసే అభివృద్ధి పనుల శంఖుస్థాపన కు జెడ్పి ఛైర్ పర్సన్, జెడ్పిటిసి సభ్యులను ఆహ్వానించకపోవడం, పెండింగ్ లో ఉన్న జెడ్పిటిసి సభ్యుల గౌరవ వేతనం వంటి సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించేవిధంగా అన్ని శాఖల అధికారులకు తెలియజేస్తామని డిఆర్ఓ తెలిపారు. అదేవిధంగా ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న జెడ్పిటిసి సభ్యుల గౌరవ వేతనం గురించి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి విన్నవిస్తామని జెడ్పి సిఇఓ తెలిపారు. గత సమావేశంలో తాము అడిగిన ప్రశ్నలకు స్పందించి తీసుకున్న చర్యల వివరాలను యం ఎల్ సి బల్లి కళ్యాణ్ చక్రవర్తి తెలుసుకున్నారు. బడ్జెట్ ప్రతిపాదనలను వివిధ అంశాల వారీగా వివరిస్తూ గత సంవత్సర సవరించిన ఆదాయ వ్యయాలు, 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలను డిప్యూటీ సీఈవో మోహన్‌రావు సభ ముందుంచారు. జెడ్పి ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిషత్ బడ్జెట్ రూ.379,80,03,800 రూపాయల అంచనా తో ఆమోదించినట్లుగా తెలిపారు. జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ మరియు ఆర్డబ్ల్యూఎస్ విభాగం యొక్క ఆదాయ వ్యయాలను కలుపుకొని తయారు చేసినట్లుగా వివరించారు. 2024-25 సంవత్సరమునకు సవరించిన అంచనాలు ప్రకారం రూ.354 కోట్లు ఆదాయం గాను, రూ.343 కోట్లు వ్యయం గాను, అలాగే 2025 - 26 సంవత్సరమునకు బడ్జెట్ అంచనాలు రూ.379 కోట్లుగా, వ్యయం రూ.368 కోట్లు గా తయారుచేసి, రూ.10 కోట్లు మిగులు బడ్జెట్ తో అంచనాలు తయారుచేసినట్లుగా వివరించారు.





## ఏపీ కమ్మవారి సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా మండవ మురళి కృష్ణ ఏకగ్రీవ ఎన్నిక

### మంగళగిరిలో జరిగిన కమ్మవారి సేవాసమాఖ్య సమావేశంలో పెద్దల తీర్మానం






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 30)** మంగళగిరిలోని రాయల్ బ్యాంకెట్ హాలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ పెద్దలు సమావేశము ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమ్మ సామజిక వర్గం అవసరాలు దృష్ట్యా కమ్మవారి సేవా సమాఖ్య-ఆంధ్రప్రదేశ్ పేరిట ఒకట్రస్టును కమ్మ వారి సేవా సమాఖ్య-ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు ఏర్పాటు చేసారు. ఆ ట్రస్టుకు గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ గని భాస్కరరావుని, అధ్యక్షులుగా మండవ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కొత్త పల్లి రమేష్ చంద్ర, కోశాధికారిగా గూడూరి నాగ కోటేశ్వరరావు, కార్యదర్శిగా సూరపనేని స్వరూపరాణి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రస్టును ఏర్పాటు చేసిన గూడూరు సత్యనారాయణకు రాష్ట్ర కమ్మ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మందలపు జగదీష్ , టీటీడీ అక్కిన ముని కోటేశ్వరరావు,గ్రేటర్ విజయవాడ కమ్మవారి సేవాసమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, గుమ్మడి రామకృష్ణ, గద్దె శ్రీనివాస్, కామేశ్వరరావు, ప్రకాశంజిల్లా కమ్మవారి సేవాసమితి కార్యదర్శి ఆలా నాగేశ్వరరావు, కమ్మవారి సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ మున్సిపాలిటీగా కందుకూరును తీర్చిదిద్దడమే ధ్యేయం

పబ్లిక్ టాయిలెట్స్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి

రైతు బజార్ పరిశీలన...పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలి

రైతు బజార్ వద్ద బోర్డుపై కూరగాయల ధరల పరిశీలన

అధిక ధరలకు అమ్మినచో చర్యలు - ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 30)**

కందుకూరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దటమే లక్ష్యమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు పట్టణంలో రైతు బజార్ వద్ద స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా 13.28 లక్షలతో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి బుధవారం సాయంత్రం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజా సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణాన్ని చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బహిరంగ మలమూత్ర విసర్జన ద్వారా వ్యాపించే అంటు వ్యాధులను నివారించడానికి, పట్టణ ప్రగతిలో భాగంగా టాయిలెట్స్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. పట్టణంలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి పబ్లిక్? టాయ్ లెట్స్ నిర్మిస్తామన్నారు. ప్రజలు ఈ టాయిలెట్స్‌ను ఉపయోగించుకుని బహిరంగ మల, మూత్ర విసర్జనకు స్వస్తి పలకాలని, స్వచ్ఛ కందుకూరు కు సహకరించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులు అధికారులు అందరూ పాల్గొని పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా పబ్లిక్ టాయిలెట్స్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి కాంట్రాక్టర్ పూల బొకేతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రైతు బజార్ ప్రాంతాన్ని సందర్శించి పరిశుభ్రత పరిశీలించారు.. రైతు బజార్ లోని బోర్డుపై ఉన్న కూరగాయల ధరలను పరిశీలించి, ప్రజల వద్దకు వెళ్లి ధరలను అడిగి తెలుసుకున్నారు.. కూరగాయలను అధిక ధరలకు అమ్మినచో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనూషా, రాష్ట్ర బీసీ సెల్ కార్ కార్యదర్శి చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, బిజెపి నాయకులు వరప్రసాద్, జొన్నాదుల రాఘవులు, రెబ్బవరపు మాల్యాద్రి, షేక్ నజీర్, అత్తంటి శ్రీహరి నాయుడు, వడ్డెళ్ళ రవిచంద్ర, చుండూరి శ్రీను, రావూరి రామకోటయ్య, కొత్తూరి వెంకట సుధాకర్, పొడపాటి నాగేశ్వరరావు,ముచ్చు వేణు, చదలవాడ ఇమ్మానియేల్, చేవూరు రమేష్,చనమాల శ్రీధర్, షేక్ మూసా, పులి నాగరాజు, తలతోటి మస్తాన్, గుమ్మా శివ, అత్తంటి శివకృష్ణ, చక్కా కేశవ, రాజా, జియావుద్దీన్, శ్యామ్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం ఇవ్వాలి

### ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు

**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఏప్రిల్ 30)**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు హనుమంతునిపాడు మండల కేంద్రంలోని ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం కేతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో పాల్గొన్న వీరు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకొనుటకు ఉపాధి కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సి అవసరం ఉందని తెలిపారు కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టానికి



ఇచ్చేటువంటి నిధులు సగానికి సగం కోత విధించారని ఆరోపించారు కరోనా సమయంలో లక్ష ఇరవై వేల కోట్లు నిధులు కేటాయించిన ప్రభుత్వం నేడు 68 వేల కోట్లకు కుదించిందని ఆవేదన వ్యక్తపరిచారు గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పూర్తిగా కనుమరుగే పరిస్థితి దాపురించిందని ప్రకృతి సహకరించడం లేదని రైతుల సైతం వ్యవసాయ కూలీలుగా మారుతున్నారని ఇలాంటి స్థితిలో ఉపాధి హామీ చట్ట మాత్రమే రైతులను కూలీలను ఆదుకుంటుందని విషయాన్ని గుర్తు చేశారు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నిధులు కేటాయించడంలో వివక్ష ప్రదర్శిస్తుందన్నారు ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్నటువంటి ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ వివరించారు ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ భవిష్యత్తు పోరాటాలలో ఉద్యమాల్లో పాల్గొన్నారు ఉద్యోగ భద్రత ప్రమోషన్లు కనీస వేతన చట్టం రాజకీయ వేధింపులు తదితర అంశాలపై వివరించారు ఈ కార్యక్రమంలో సంఘం నూతన కమిటీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మండల కమిటీ అధ్యక్షులుగా కేతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి ఉపాధ్యక్షులుగా జే ప్రసాదు ప్రధాన కార్యదర్శిగా జి వెంకటేశ్వర్లు సహాయ కార్యదర్శిగా జి చిన్న ట్రెజరర్ గా కే రవి కోశాధికారిగా జి గురుకృష్ణ కమిటీ సభ్యులుగా పి లక్ష్మీదేవి రాజేష్ హరినాథ్ రెడ్డి లను మండల నూతన కమిటీ గా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు నూతన కమిటీ కి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

## నక్షత్ర గ్రాండ్ హోటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు పట్టణంలోని పామూరు రోడ్‌లో వలేటివారిపాలెం

మండలం నలదలపూరు గ్రామానికి చెందిన మన్నం కృష్ణ

ఆహ్వానం మేరకు నక్షత్ర

గ్రాండ్ హోటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి


**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 30)**

గ్రాండ్ హోటల్‌ను బుధవారం ఉదయం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి నిర్వాహకులు మనం కృష్ణ కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, చిలకపాటి మధుబాబు, వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ రఫీ, రావూరి రామకోటయ్య, చుండూరి శ్రీనివాసరావు, కొమ్మి ప్రవీణ్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.









## సీఎం పర్యటనతో మారనున్న ఆత్మకూరు రూపురేఖలు

పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా ఆత్మకూరు ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవం

పరిశ్రమల ఏర్పాటుతో యువతకు పెద్దఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు

ఆత్మకూరు నుంచే రాష్ట్రవ్యాప్తంగా 50 పారిశ్రామికవాడలకు శ్రీకారం చుట్టనున్న సీఎం

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 30)**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనతో ఆత్మకూరు నియోజకవర్గ భవిష్యత్, రూపురేఖలు మారనున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఉదయం నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో సీఎం ఆత్మకూరు పర్యటనపై మంత్రి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్డీఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండోసారి ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటనకు రావడం చాలా సంతోషంగా వుందన్నారు. మొదటిసారి ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల నిమిత్తం సోమశిల పర్యటనకు వచ్చారని, నేడు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఆత్మకూరు నుంచే శ్రీకారం చుట్టడం ఆత్మకూరుకు గర్వకారణమన్నారు.



నారంపేట వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 173 ఎకరాల ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులో రోడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేసి భూమిని అభివృద్ధి చేశామని, సీఎం ఈ ప్రాంతాన్ని సందర్శించి ఎం ఎస్ ఎం ఈ పార్క్ పైలాన్ ఆవిష్కరించి ప్రారంభిస్తారని, ఇక్కడి నుంచే రాష్ట్రవ్యాప్తంగా 50 పారిశ్రామికవాడలను సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేస్తారని మంత్రి చెప్పారు. ఆత్మకూరు నారంపేట ఎపిఐఐసి పార్కు ఏర్పాటుతో భారీగా పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఏర్పాటుకానున్నట్లు మంత్రి చెప్పారు. ప్రతి కుటుంబంలో ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే లక్ష్యంగా 2047 ప్రణాళికను సీఎం రూపొందించినట్లు చెప్పారు. మెట్టప్రాంత యువత భవిష్యత్, ఉపాధి ఉద్యోగాలకు ఈ పారిశ్రామికవాడ బాటలు వేస్తుందని మంత్రి ఆకాంక్షించారు. గురువారం ఉదయం షెడ్యూల్ ప్రకారం ఉదయం 11:30 కు ఆత్మకూరు లోని బాలికల గురుకుల పాఠశాల లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు సీఎం చేరుకుంటారని, అక్కడ ముఖ్యమంత్రికి ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలుకుతారని మంత్రి చెప్పారు. అనంతరం 11:50 కు నెల్లూరుపాలెం కు చేరుకుని ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని, గిరిజనుల సమస్యలు తెలుసుకుంటారన్నారు. 12:10 నుండి 12:30 వరకు నెల్లూరుపాలెం గ్రామం లోని బిల్డింగ్ వర్కర్స్ తో ముఖాముఖిగా మాట్లాడతారన్నారు. అనంతరం 12:35 కు నారంపేట ఏపిఐఐసికు చేరుకుని ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని, అనంతరం 1:30 నుండి 3:00 వరకు ప్రజావేదికలో స్థానికులతో ముఖాముఖిలో పాల్గొంటారన్నారు. అనంతరం 3:05 కు టిడ్కోగ్రౌండ్ కు చేరుకుని 4:35 వరకు పార్టీ క్యాడర్ తో మాట్లాడిన అనంతరం 4:40 కు హెలిప్యాడ్ కు చేరుకుని 5:45 కు ఉండవల్లి లోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుంటారని ముఖ్యమంత్రి పర్యటన వివరాలను మంత్రి వెల్లడించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు.

## ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సురక్ష బీమా, జీవనజ్యోతి బీమా దరఖాస్తు చేసుకోవాలి





**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 30)**

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత బుధవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు కూలీలు ప్రధానమంత్రి సురక్ష బీమా మరియు జీవనజ్యోతి బీమా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన దరఖాస్తు కొరకు బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ నందు పొదుపు ఖాతా ఉన్న వ్యక్తులు, 18 నుండి 70 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు, జాతీయం చేయబడిన బ్యాంకులందు 20 రూపాయలు ప్రీమియం చెల్లించి బ్యాంకులో కానీ పోస్ట్ ఆఫీస్ లో గాని దరఖాస్తు చేసుకున్న యడల ప్రమాదవశాత్తు మరణించిన, పూర్తి అంగవైకల్యం కలిగిన వారికి రెండు లక్షల రూపాయలు నష్టపరిహారం పొందే అవకాశం, ప్రమాదవశాత్తు పాక్షికంగా అంగవైకల్యం కలిగిన వ్యక్తులకు లక్ష రూపాయలు నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందని, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా 436 రూపాయల ప్రీమియం తో బ్యాంకు కానీ పోస్ట్ ఆఫీస్ లో గాని దరఖాస్తు చేసుకోవాలని వయసు వయోపరిమితి 18 నుండి 50 సంవత్సరాలు లోపు మధ్య వయసు కలిగిన వారై ఉండాలని, భీమా చేసుకున్న వ్యక్తులు ఏ కారణంతో అయినా మరణించిన వారికి నామినేకి రెండు లక్షల నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు.

## ఘనంగా శ్రీ సీత సమేత రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవం

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 30)**




మండలంలోని నాగిరెడ్డిపాలెంలో బుధవారం శ్రీ సీతా సమేత రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట కుంబాభిషేకంలో భాగంగా బుధవారం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సీతారాములవారికి వేద మంత్రోచ్చరణలతో మంగళహారతులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



మండలములోని భక్తులు గ్రామ కమిటీ అధ్యక్షులు గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు.

## మే 2 ప్రధానమంత్రి మోడీ పర్యటను విజయవంతం చేయాలి

### టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 30)**

మే రెండో తేదీన ప్రధానమంత్రి మోడీ పర్యటన విజయవంతం చేయాలని మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని అమరావతి పనుల పునః ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు వస్తున్న సందర్భంగా మండలంలోని టిడిపి నాయకులు అనుసంధాన నాయకులు ఈ కార్యక్రమం పాల్గొని జయప్రదం చేయాలని ఆయన తెలిపారు.

## ఆదాల ఆశీర్వాదం తీసుకున్న నూతన వధూవరులు

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 30)**



నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్లో బుధవారం జరిగిన టంగుటూరు శ్రీనివాసులురెడ్డి కుమార్తె శరణ్య, కొడవలూరు వెంకట కృష్ణారెడ్డి కుమారుడు భాస్వంత్ రెడ్డి వివాహ మహోత్సవ కార్యక్రమానికి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను మాజీ ఎంపీ ఆదాల అక్షింతలు వేసి శుభఆశీస్సులు అందించారు. అదేవిధంగా నెల్లూరు విజయ డెయిరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి నూతన వధూవరులకు ఆశీస్సులు అందించారు. వివాహ మహోత్సవ కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, సీ హెచ్ హరిబాబు యాదవ్, మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, బెల్లంకొండ వెంకయ్య, నాని, తదితరులు హాజరయ్యారు.

## రావిపాడులో మండపం పై పిడుగు చెలరేగిన మంటలు కంభం మండలంలో గాలి వాన బీభత్సం





(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 30)

మండలంలోని రావిపాడులో బుధవారం శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలోని మండపంపై పిడుగు పడింది. అకస్మాత్తుగా మండపంపై మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని సత్వర చర్యలు చేపట్టారు. అలాగే కంభం మండలం హజరత్ గూడెంలో వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన రెండు గేదెలు పిడుగుపాటుకు మృతి చెందాయి.పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ అంతరాయం కలిగింది.

## మధుసూదన్ కుటుంబాన్ని పరామర్శించిన బీద



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 30)

జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడిలో మరణించిన కావలివాసి మధుసూదన్ నివాసానికి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు బుధవారం చేరుకున్నారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రధాన మోడీతో మాట్లాడి అన్ని విధాల సాయి సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. టూరిస్ట్‌ల పై దాడి చేయడం బాధాకరమన్నారు.

## సీఎం పర్యటనకు 1,075 మంది సిబ్బంది జిల్లా ఎస్పీ వెల్లడి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 30)

గురువారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా 1,075 మంది మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జి కృష్ణ కాంత్ బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన పలు సూచనలు తెలియజేశారు. సీఎం పర్యటనలో ఎక్కడ అజాగ్రత్తగా ఉండకూడదు అని ఆయన హెచ్చరించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు.

## సింహాచలం ఘటన అత్యంత బాధాకరం మేకపోతుల శ్రీనివాసరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 30)

విశాఖపట్నంలోని సింహాచలం చందనోత్సవంలో 7గురు భక్తులు దుర్మరణం చెందిన ఘటన బాధాకరమని సిపిఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో సింహాచలం ఘటనపై ఆయన స్పందించి మాట్లాడుతూ సింహాచలం ఘటన ముమ్మాటికి ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. యేటా చందనోత్సవానికి సుమారు 3 లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనాలు ఉన్నప్పటికీ అధికారులు భద్రతా చర్యలు చేపట్టకపోవడంలో అర్థం లేదన్నారు. ఒకే కుటుంబంలో నలుగురు వ్యక్తులు చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. వర్షం.. గాలికి గోడలు కూలుతున్నాయంటే నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం పాటించారో ఇట్టే అర్థమవుతుందన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50లక్షలు ఆర్థిక సాయం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

### రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 30)

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత వ్యాపారస్థులపై ఉందని, ఇండెంటు ఇచ్చి మార్కెట్లో వ్యాపారస్థులు పాల్గొనకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. వెల్లంపల్లి పొగాకువేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు ఆక్షన్ ను అయన పరిశీలించి అనంతరం మీడియాతో మాట్లాడారు. వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి సందర్శించారు. వేలం కేంద్రానికి వచ్చిన వైవీ కి జిల్లా వైఎస్‌ఆర్సిపి అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు బూచెపల్లి శివప్రసాద రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత కంపెనీలు అన్నీటిపై ఉందన్నారు. పొగాకు కొనే కంపెనీలమధ్య పోటీలేనందున రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతుందని అన్నారు. ప్రభుత్వం రైతు సంఘాలతో, కంపెనిలతో సమావేశం ఏర్పాటు చేసి రైతులని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు పెట్టుబడులు పెట్టి అసలుకూడ రాక నష్టపోవడం అన్యాయమని అన్నారు. త్వరలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పొగాకు రైతులతో మాట్లాడతారని, వేలం కేంద్రాలను సందర్శిస్తాడని అన్నారు. వ్యాపారాల రైతులని ఇబ్బందులకు గురించేయ్యోద్దని అన్నారు. ఈసందర్భంగా వేలం కేంద్రం అధికారులతో, రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ,మాజీ మంత్రి మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ,ఒంగోలు ఇంచార్జ్ చుండూరు రవి ,కనిగిరి ఇంఛార్జి దద్దాల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.





# సెక్యులరిజం అంటే ఒక మతానికి చెందింది కాదు

### జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 30)

నిన్ను ఎక్కడ తలదించుకొని ఇవ్వను అని పవన్ కళ్యాణ్ చెప్పారని ఆ తల్లి పలికింది. పాకిస్తాన్ కంటే భారతదేశం లోనే ముస్లిమ్స్ ఎక్కువ మంది సేఫ్ అండ్ సెక్యూర్ గానే ఉన్నారు. జమ్మూ కాశ్మీర్ భారత్ దే మునుపటిలాగా కనికరంతో గమ్ముండే పరిస్థితి లేదని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ అన్నారు. కుటుంబ పెద్ద కోల్పోయిన వారి మీద ధాడి కేవలం వారి కుటుంబానికే కాదు ప్రతి భారతీయుడి మీద చేసినట్లే దీనికి సరైన గట్టి సమాధానం ప్రధాని మోడి, షా నాయకులను చూశాను .40 నిమిషాలు నాతో మాట్లాడి మా బాధను తనతో తీసుకెళ్లిన పవన్ కళ్యాణ్ ని చాస్తే ఆశ్చర్యంగా ఉంది అన్న ఆ తల్లి కి తోడుగా మా అందరినీ ముందుకు నడిపించే మా నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మీకు మద్దతుగా ఉన్నారని సగర్వంగా తెలిపే వచ్చామన్నారు మధుసూదన రావు తల్లిదండ్రులకు ఆసరాగా నిలబడేందుకు వారి బిడ్డలను ముందుకు నడిపించవలసిన బాధ్యత ను గుర్తు చేస్తూ ధైర్యంగా ఉండండి అని మధుసూదన్ భార్యకు తెలిపామన్నారు. తీవ్ర అస్వస్థత తో రెస్ట్ తీసుకుంటున్నప్పటికీ జిల్లాలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఉగ్రవాద దాడిలో మరణించినప్పటి నుంచి కేంద్ర కార్యాలయానికి తెలియపరచడం..సంతాప దినాలలో చేయించడం లో ముందుండి నడిపించిన వేములపాటి అజయ్ సూచనలతో కావలిలో మధుసూదన్ కుటుంబ సభ్యులను జనసేన పార్టీ జిల్లా కార్యాలయం తరఫున కలిసి మాట్లాడడం జరిగింది. పవన్ కళ్యాణ్ గారు 5 లక్షల రూపాయలు ప్రమాద బీమా కాకుండా 50 లక్షలు రూపాయలు జనసేన పార్టీని ఇస్తున్నారన్న విషయం పార్టీ తరఫున తెలియజేయడం జరిగింది. అనంతరం ప్రెస్ క్లబ్ నందు మీడియా సమావేశం నిర్వహించి జనసేన నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, కార్యాలయం ఇన్చార్జి జమీర్, కావలి నాయకులు వెంకటసుబ్బయ్య, సందీప్ సర్వేపల్లి నాయకులు బోనబోయిన ప్రసాద్ యాదవ్, పవన్ యాదవ్, రాజేష్, పోలయ్య, వెంకట్ యాదవ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.





# పదవీ విరమణ పొందిన అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్‌ను సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికిన జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

### పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించిన జిల్లా ఎస్పీ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 30)

పోలీసు శాఖలో చేరి గత 35 సంవత్సరాల కాలం పాటు విశేష సేవలు అందించి పదవీ విరమణ పొందిన బేస్తవారిపేట పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎ ఎస్ఐ పి నారాయణరెడ్డిని బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండి వారి సాధకబాధకాల్లో మమేకమై సేవలందించే అవకాశం పోలీసుశాఖలోనే అధికంగా ఉంటుందన్నారు. పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ 35 సం' కాలం పాటు పోలీసుశాఖలో సమర్థవంతంగా, క్రమశిక్షణతో పనిచేసి తమ సేవలు అందించినందుకు అభినందించారు. పదవీ విరమణ ప్రతి ఒక ఉద్యోగికి తప్పదని, ఉద్యోగంలో ఉన్నపుడు చేసిన సేవలే ఉద్యోగణాంతరం కూడా వ్యక్తి గుర్తుండేలా మంచి పేరు ప్రఖ్యాతలు తెస్తాయన్నారు. ఉద్యోగ నిర్వహణలో ఎంతో నిబద్ధత, అంకితభావంతో పోలీస్ శాఖకు అందించిన సేవలను శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. సకాలంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందేటట్లు అన్ని చర్యలు తీసుకుంటామని, వచ్చిన డబ్బులను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, ఇకపై కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు. భవిష్యత్తులో వారికి ఏ సహాయం కావాలన్నా పోలీస్ శాఖ ఎల్లవేళలా వారికి తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఎఆర్ఎస్ఐ తిరుపతి స్వామి, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.






## వీరయ్య చౌదరి కుటుంబానికి సోమిరెడ్డి పరామర్శ





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 30)

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి దారుణ హత్యకు గురయ్యారు. బుధవారం ఆయన కుటుంబసభ్యులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వీరయ్య చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఘటనపై ఆరా తీసి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

# సింహాచలం ఘటన దురదృష్టకరం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
భారీ వర్షం కారణంగా గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి
ఘటనపై వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు
మెరుగైన వైద్యసౌకర్యాలు అందించాలని, బాధితులకు అండగా నిలవాలని ఆదేశాలు
ఘటనపై ముగ్గురు సభ్యులతో విచారణకు ఆదేశించిన సీఎం
మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు, క్షతగాత్రుడికి రూ.3 లక్షలు ప్రకటించిన సీఎం
ప్రగాఢ సానుభూతి ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీ
మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రుడికి రూ.50వేలు ప్రకటించిన ప్రధాని
ఈ ఘటన మినహా భక్తులకు ఇబ్బందులు లేకుండా సజావుగా దర్శనం కొనసాగేలా చర్యలు
దర్శన ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్న భక్తులు
మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 30)**

సింహాచలం ఆలయంలో ప్రకృతి వైపరీత్యం వలన భక్తులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం, బాధాకరమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి దిగ్భ్రాంత్రి వ్యక్తం చేశారు. సింహాచలం ఘటనపై బుధవారం నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశాఖపట్టణం జిల్లా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రతిఏటా నిర్వహించే విశిష్టమైన నిజరూప దర్శనానికి లక్షలాదిగా భక్తులు విచ్చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున గాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షం వలన సంభవించిన ప్రకృతి వైపరీత్యానికి స్వామివారి నిజరూప దర్శనానికి విచ్చేసిన ఏడుగురు భక్తులు మరణించగా, ఒకరు గాయపడినట్లు మంత్రి వెల్లడిరచారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ మంత్రులు అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర హెూం మంత్రి అనితని రాష్ట్ర ప్రభుత్వం తరఫున హుటాహుటిన ఘటన జరిగిన స్థలానికి పంపి సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి చెప్పారు. బుధవారం తెల్లవారుజామున రెండు గంటలకు దర్శనాలు ప్రారంభం కాగా అదే సమయంలో భారీ ఈదురు గాలులతో భారీ వర్షం కురవడం వలన కొండలపై నుంచి భారీగా వర్షం నీరు చేరడంతో ప్రహరీ గోడ కింద ఉన్నటువంటి మట్టి అంతా కరిగి కొత్తగా కట్టినటువంటి ప్రహరీ గోడ పడిపోవడంతో ఈ ఘటన జరిగినట్లు మంత్రి చెప్పారు. అనేక ఆలయాలకు కేంద్ర ప్రభుత్వం పర్యాటక రంగం నుంచి ప్రసాదం స్కీం కింద ఆలయాల అభివృద్ధి నిర్మాణ పనులు చేపడుతుందని, ఒకవైపు శ్రీశైలం, మరోవైపు కనకదుర్గమ్మ ఆలయం కొన్ని అభివృద్ధి పనులు ప్రసాదం స్కీం కింద పూర్తయ్యాయని, సింహాచలంలో కూడా ఆలయ అభివృద్ధి పనులు ప్రసాదం స్కీం కింద ప్రారంభమైనట్లు చెప్పారు. అటు పర్యాటక రంగం, ఇటు దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. సింహాచలంలో జరిగే చందనోత్సవం ప్రభుత్వ పండుగ గుర్తించడం జరిగిందని, దేవాదాయ శాఖ మంత్రిగా తాను, రెవిన్యూ శాఖ మంత్రి, హెూం మంత్రి, అనువంశిక ధర్మకర్తగా అశోక్ గజపతిరాజు దాదాపు రెండు నెలల నుంచి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఘటన జరిగిన తథనంతరం సహాయక చర్యలు ముమ్మరం చేసి దూరప్రాంతాల నుంచి వచ్చినటువంటి భక్తులకు స్వామి వారి దర్శనం సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. దర్శనాలన్నీ ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా సాగుతున్నాయని, భక్తుల నుంచి కూడా ఏర్పాట్లపై మంచి స్పందన వస్తుందన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు అన్ని సజావుగా సాగాయని భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఒక్క దురదృష్ట ఘటన మినహా అంతా సజావుగా సాగుతుందన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర విచారం వ్యక్తం చేసిందని, సింహాచలం ప్రమాద ఘటనపై ఉన్నతాధికారులు, మంత్రులతో సిఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తగిన ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారని, జిల్లా అధికారులతో మాట్లాడి ఘటన జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సాయం వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. గోడ కూలిన ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు సిఎం ఆదేశించారని, విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చనిపోయిన ఒక్కొక్కరికి 25 లక్షలు, గాయాలు పాల్కెన వారికి మూడు లక్షల రూపాయలతో పాటు వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందన్నారు. సింహాచల ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారని, మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తరఫున రెండు లక్షలు, గాయపడిన వారికి 50 వేలు పరిహారం ప్రకటించినట్లు మంత్రి చెప్పారు. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయ శాఖలో పరిధిలోని ఆలయాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, ఆ కుటుంబాలకు అన్ని విధాల అండగా వుంటామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మృతుల వివరాలను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు.మృతి చెందిన వారిలో విశాఖపట్నం మధురవాడకు చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగులు పిల్లా మహేష్, పిల్లా శైలజ దంపతులు, హెచ్ బి కాలనీ విశాఖపట్నం కు చెందిన గుజ్జారి మహాలక్ష్మి, విశాఖపట్నం హెచ్బీ కాలనీ వెంకోజి పాలెం కు చెందిన పైలా వెంకటరత్నం, అంబాజీపేట, మాచవరం, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషారావు, అడవివరం సింహాచలం కు చెందిన ఎడ్ల వెంకటరావు, కొర్లపాటి వారి పాలెం, అంబాజీపేట మాచవరం కు చెందిన పత్తి దుర్గా స్వామి నాయుడుగా మంత్రి ప్రకటించారు.



# షర్మిలరెడ్డి పై కేసు నమోదు చేయాలి

## బిజెపి నేత మిడతల రమేష్

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 30)**

ఇండియన్ ఇంటెలిజెన్స్ ఫెయిల్యూర్ అన్న షర్మిలపై సుమోటోగా ప్రభుత్వం పోలీసులు కేసు నమోదు చేయాలని బిజెపి నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. ఐదు రోజుల క్రితం విజయవాడలో మీడియా ముందు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ షర్మిల రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై విద్వేష కుట్రపూరితమైన వ్యాఖ్యలు చేశారన్నారు. పహాల్గంలో జరిగిన ఉగ్రదాడిలో మతం లేదని, దేశం లోపల మతం పేరుతో యుద్ధం జరుగుతుందని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఈ దేశ ఇంటర్నల్ టెర్రరిస్టు అని, ఇండియన్ ఇంటెలిజెన్స్తో పాటు వ్యవస్థలన్నీ మోడీ కోసమే పనిచేస్తున్నాయని తమ వక్రబుద్ధిని షర్మిల బయటపెట్టారన్నారు. పహాల్గంలో పాక్ తీవ్రవాదుల మారణకాండ కు మోడీ అమిత్షాలే బాధ్యులు. వీరిద్దరూ తక్షణం రాజీనామా చేయాలని షర్మిల చేసిన వ్యాఖ్యలు పై ఆమెను అదుపులోకి తీసుకొని విచారణ చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. షర్మిల వ్యాఖ్యలు పాక్ తీవ్రవాదాన్ని సమర్థించేలా ఉన్నాయి. ఉగ్ర దాడి అనంతరం శత్రుదేశానికి మనకు యుద్ధ వాతావరణం నెలకొంటూ ఉంది. ఈ పరిస్థితుల్లో దేశానికి మద్దతు ఇవ్వాల్సింది పోయి ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించేందుకు షర్మిల కుట్ర పన్నుతున్నారని ఆందోళన చెందుతున్నమన్నారు. భారత ప్రభుత్వం ఉగ్ర మూకలను అంతమొందించే వరకు దేశ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనే వరకు షర్మిలాను అరెస్టు చేసి జనావాసాలకు దూరంగా ఉంచాలని రమేష్ డిమాండ్ చేశారు. యుద్ధ వాతావరణ సమయంలో దేశ ప్రధానిని ఇంటర్నల్ టెర్రరిస్ట్గా పేర్కొనడం పై ఎన్ఐఏ షర్మిలను విచారించాల్సిన అవసరం ఉందని రమేష్ కేంద్ర నిఘా సమస్యలకు ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

# ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 30)**

మండల కేంద్రమైన ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులతో ముందుగా నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివించి అనంతరం పిల్లల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసే ప్రయత్నంలో వారికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. అందులో గెలుపొందిన 13 మంది విజేతలకు బహుమతులు ఇవ్వడం జరిగింది. 20 మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం కూడా ఇవ్వడం జరిగినది.అనంతరం పిల్లలందరికీ స్నాక్స్ పంచిపెట్టారు. ఎక్కువ మంది పిల్లలను గ్రంథాలయానికి పంపిస్తున్న వారి తల్లిదండ్రులకు గ్రంధపాలకుడు కృతజ్ఞలు తెలిపారు. హాజరైన విద్యార్థులు 37 కాగా, సభ్యత్వం చేరినది 20గా ఉన్నట్లు గ్రంథ పాలకుడు డి కోటేశ్వరరావు తెలిపారు.









# ప్రోత్సాహాలకు పేర్లు నమోదు చేసుకోండి

**(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, ఏప్రిల్ 30)**

జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం తీసుకున్న నిర్ణయం మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మండలాలలో ఈ ఏడాది 2025 ఏప్రిల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ లలో ఉత్తీర్ణలై మెరిట్ సాధించినటువంటి విశ్వబ్రాహ్మణులకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఆయా మండలాల ప్రతినిధులతో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ఈదుమూడి. రవి ప్రసాద్, జిల్లా ప్రచార కార్యదర్శి ఈదుమూడి ప్రసాద్ లు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులై 500 పైన మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలలో చదివిన విద్యార్థినీ, విద్యార్థులకు 550 మార్కులకు పైగా వచ్చినవారు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ ప్రభుత్వ కాలేజీలో చదివినవారికి 800 మార్కులు, ప్రైవేట్ కాలేజీలో చదివిన వారికి 850 మార్కులు సాధించిన వారు తమ మార్కుల జాబితాను, స్థానిక విశ్వబ్రాహ్మణ మండల కమిటీల చే ధృవీకరించిన పత్రాలను విద్యా అభివృద్ధికమిటీ చైర్మన్ అద్దంకి వెంకట అజయ్ కుమార్. 9949944812, 9989646378 పై నెంబర్లను సంప్రదించి పూర్తి వివరాలను తెలుసుకోగలరని పేర్కొన్నారు.

# మెప్మా ఒంగోలు నగర సిటీ మిషన్ మేనేజర్ కల్పన సస్పెండ్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 30)**

మెప్మా ఒంగోలు నగర సిటీ మిషన్ మేనేజర్ జి కల్పనను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ మిషన్ డైరెక్టర్ ఎన్ తేజ్ భరత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కల్పన సిటీ మిషన్ మేనేజర్గా చేరినప్పటి నుండి ఆమె మీద పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పలువురు డ్వాక్రా సంఘం సభ్యులు గత నెలలో ఆ శాఖ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మీద విచారణ చేపట్టిన మెప్మా ప్రకాశం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీహరి ఆమెను కొద్దిరోజులు క్రితం ఉన్నతాధికారుల వద్ద సరెండర్ చేశారు. మొత్తం వివరాలు సేకరించిన ఉన్నతాధికారులు బుధవారం ఆమెను సస్పెండ్ చేశారు.

# కారు ప్రమాదంలో ఐదుగురు వైద్య విద్యార్థుల మృతి పై ఆదాల దిగ్భ్రాంతి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 30)**

నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం వద్ద జరిగిన కారు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంపై నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటువంటి దుర్ఘటన చోటు చేసుకోవడం అత్యంత బాధాకరమని మాజీ ఎంపీ ఆదాల ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని, వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేసి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# కుల గణనపై కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం శుభ పరిణామం

## 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 30)**

కుల గణనపై కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం శుభ పరిణామం అని కేంద్ర ప్రభుత్వానికి 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో ధన్యవాదములు తెలియజేశారు అలాగే బీసీ సంఘాలు కుల సంఘాలు సుదీర్ఘంగా పోరాటం చేసినటువంటి నాయకులు అందరికీ అభినందనలు తెలియజేశారు. దశాబ్దాల కాలంగా పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం నేటికీ ఇవ్వటం బీసీలకు మంచి భవిష్యత్తు ఉంటుందని శ్రీనివాసులు తెలిపారు. అలాగే చట్టసభలలో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించే విధంగా ఎలాంటి లోపాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రయత్నం చేయాలని శ్రీనివాసులు తెలిపారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముత్తుముల

(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, ఏప్రిల్ 30)

మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. కస్తూర్బా స్కూల్ లోని జూనియర్ కాలేజీకి శంకుస్థాపన చేసి పశువుల వైద్యశాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అలాగే దర్గా రోడ్డు సమీపంలో ఈద్గా వద్ద నూతన మంచినీటి బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 30)

ఒంగోలు నగరంలో 6 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ప్రారంభించారు. 9వ డివిజన్‌లోని పులి వెంకటరెడ్డి కాలనీ వద్ద 2 కోట్ల రూపాయలతో నిర్మించనున్న సీసీ డ్రైనేజ్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. అదే డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప వద్ద 2.70 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. 16వ డివిజన్ లోని బాలాజీ నగర్‌లో రూ.46 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైనేజ్ కాలువను ప్రారంభించారు. 24వ డివిజన్‌లోని ఉంరచెరువులో రూ.40 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. 35 వ డివిజన్ లోని సాయిబాబా గుడి వద్ద రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును దామచర్ల ప్రారంభించారు. ఎంఎల్ఏ వెంట ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, డివిజన్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఉలవపాడుశాఖా గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

### పౌర గ్రంథాలయ సంచాలకులు ఎ కృష్ణమోహన్ డిప్యూటీ డైరెక్టర్ పి ఆర్ అహ్మద్





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 30)

మండల కేంద్రమైన ఉలవపాడు శాఖా గ్రంథాలయాన్ని బుధవారం పౌర గ్రంథాలయ సంచాలకులు కృష్ణ మోహన్, డిప్యూటీ డైరెక్టర్ పిఆర్ అహమద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న వేసవి శిక్షణా తరగతుల గురించి సూచనలు ఇస్తూ ఎండల్లో పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని, పిల్లలకు సంబంధించిన మంచి పుస్తకాలు అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీచేశారు. గ్రంథాలయంలో ర్యాక్స్ నందు అమర్చిన పుస్తకాలను ఎంతో ఇష్టంతో ప్రతి ర్యాక్‌లోని పుస్తకాలను పరిశీలించారు. అలాగే గ్రంథాలయ పరిసరాలను కూడా ఎక్కువ సమయం కేటాయించి క్షుణ్ణంగా పరిశీలించారు. చివరిగా వేసవి శిక్షణా తరగతులకు సంబంధించిన రికార్డులు కూడా తనిఖీ చేసి గ్రంథాలయానికి సంబంధించిన అన్నీ చాలా బాగున్నాయి అని సంతృప్తి వ్యక్తం చేశారు.

## సింహాచలం ఘటన బాధాకరం

### సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 30)

సింహాచలం అప్పన్న సన్నిధిలో గోడ కూలి 8 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ చందనోత్సవ దర్శనానికి వచ్చిన భక్తులు ప్రమాదానికి గురికావడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

# పశు పోషకులకు అవగాహనా సదస్సు





(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, ఏప్రిల్ 30)

మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో వేసవిలో పశు పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశుపోషకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కే బేబీ రాణి ముఖ్య అతిథిగా హాజరై వేసవిలో పశువుల సంరక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పశు పోషకులకు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బేబీ రాణి మాట్లాడుతూ మేతకు వెళ్లిన జీవాల దాహం తీర్చేందుకు ఉపాధి హామీ అనుసంధానంతో నిర్మించిన నీటి తొట్టెలను ఉపయోగించు కోవాల్సిందిగా తెలియజేశారు. ప్రభుత్వం పశు పోషకుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తు చేయూతనిస్తోంది. ప్రభుత్వము ఇప్పటికే పశు పోషకులకు ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసాలు, మినీ గోకులాలు రాయితీపై పశుగ్రాస విత్తనాలు పశు బీమా వంటివి అమలు చేస్తున్నారు. పశువులకు 50% రాయితీపై నాణ్యమైన దాణ సరఫరా చేస్తుంది. తెల్ల రేషన్ కార్డు కలిగిన రైతులు ఈ పథకానికి అర్హులు దాణ కావలసిన రైతులు మీ సమీపంలో ఉన్న రైతు సేవ కేంద్రంలో గాని పశు వైద్యశాలలో కానీ సంప్రదించవలసిందిగా తెలియజేశారు. గుండ్ల సముద్రం మరియు రేగలగడ్డ గ్రామాలలో నూతనంగా నిర్మించిన నీటి తొట్టెలను పరిశీలించారు. మద్రిపూడి పశు వైద్యశాలను సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మయ్య, పశుసంవర్ధక శాఖ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.





## స్విమ్స్ ఆధ్వర్యంలో మే 1 నుంచి డక్కిలి పిహెచ్‌సిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

### మహిళలకు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలు

### వైద్యాధికారి డాక్టర్ బిందు ప్రియాంక




(షణ్ముఖ వెలుగు, డక్కిలి, ఏప్రిల్ 30)

తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె నాగరాజ్ పర్యవేక్షణలో మే 1 నుంచి డక్కిలి పిహెచ్ సిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరుగనున్నాయని మెడికల్ సూపరింటెండెంట్ తెలిపారు. పింక్ బస్సుల్లో మహిళలకు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహిస్తారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని డక్కిలి పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ బిందు ప్రియాంక కోరారు. మొత్తం 13 ప్రాంతాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారు. పింక్ బస్సులు వచ్చే ప్రాంతాల వివరాలు మే 1న డి.వడ్డిపల్లి, పాతనాలపాడు, మే 5న దగ్గవోలు, సంగనపల్లి, మే 8న లింగసముద్రం, శ్రీపురం, మే 12న మాధవాయపాళెం, తీర్థంపాడు, మే 15న మోపూరు, వెలికల్లు, మే 19న నాగవోలు, వెంబులియూరు, మే 22న పాలుగోడుగా పేర్కొన్నారు.



## అట్టహాసంగా యువ నాయకుడు గౌతమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 30)

మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి తనయుడు, టిడిపి యువ నాయకులు జూలకంటి గౌతమ్ రెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గంలో మంగళవారం పొద్దుపోయే వరకు అట్టహాసంగా జరిగాయి. ముందుగా కారంపూడి మండలం, పేట సన్నేగండ్ల శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన గౌతమ్ రెడ్డికి కారంపూడి మండల నాయకులు, యువత ర్యాలీగా కారంపూడి పట్టణంలోకి ఘన స్వాగతంతో తోడుకొని వచ్చారు. స్థానిక సుద్దగుంతల, ప్రధాన కూడళ్లలో అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకులను కట్ చేసి, అభినందనలు తెలిపారు. అనంతరం దుర్గి మండల కేంద్రం, ఎన్టీఆర్ విగ్రహం వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక ను కట్ చేసి, రాయవరం జంక్షన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి భారీ బైక్ ర్యాలీ, డీజే మోతల నడుమ మాచర్ల పట్టణ పురవీధుల్లో గౌతమ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం స్థానిక సొసైటీ కాలనీలో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అభిమానులు సమక్షంలో భారీ కేక్ కట్ చేసి, కృతజ్ఞతలు తెలియజేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన టిడిపి నాయకులు, యువత గౌతమ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ రామ్ ఫుడ్ కార్నర్ క్యాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 30)

శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటుచేసిన శ్రీ రామ్ ఫుడ్ కార్నర్ క్యాంటీన్ ను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ప్రారంభించారు. హాస్పిటల్‌కు వచ్చిన పేషెంట్లకు సందర్శకులకు, స్టాఫ్ సౌకర్యార్థం టిఫిన్, మీల్స్, జ్యూస్ ఏర్పాటు చేయడం జరిగిందని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రముఖ ఎముకలు మరియు కీళ్ల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. ఈ క్యాంటీన్ ద్వారా పోషకాహార నిపుణులు (డైటీషియన్ ) పర్యవేక్షణలో పేషెంట్లకు పోషక ఆహారం అందజేయబడుతుందని తెలియజేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో గత 12 సంవత్సరాల నుండి ప్రతినెల మొదటి గురువారం పేద ప్రజలకు ఉచితంగా అన్ని మల్టీ స్పెషాలిటీ విభాగాలకు ఉచిత ఓపి, షుగర్ థైరాయిడ్, ఈసీజీ, గర్భిణీ స్త్రీలకు అల్ట్రాసౌండ్ స్కాన్, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష, పాదాల నరాల స్పర్శ పరీక్ష లాంటి వివిధ పదకొండు రకాల విలువైన పరీక్షలకు ఉచితంగా చేయబడుతున్నాయని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. అలాగే వంశీకృష్ణని ప్రత్యేకంగా అభినందించారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో మెదడు, వెన్నెముక, నరముల వైద్య విభాగం నూతనంగా ప్రారంభించామని అనుభవజ్ఞులైన డాక్టర్ల ఆధ్వర్యంలో పేషెంట్లకు వైద్య సేవలు అందిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, డాక్టర్ చాపల శాంతకుమారి, క్యాంటీన్ ప్రతినిధులు బాలకృష్ణ, డాక్టర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com